క్లుప్తంగా

నేడు దేవాలయ భూములకు బహిరంగ వేలం

రెంటచింతల: రెంటచింతలలోని మల్లేశ్వర స్వామి దేవస్థానం భూములకు ఈ శుక్రవారం బహిరంగ వేలం పాటలను స్థానిక దేవస్థానం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న బహిరంగ వేలం పాటలో పాల్గొన్న వారికి 2025-2026 నుంచి 2027-2028 వరకు 3సంవత్సరాలకు కౌలు హక్కును ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మొత్తం 62.58 ఎకరాల మెట్టభూమికి జరిగే ఈ వేలం పాటలో పాల్గొనే వారు రూ.5 వేలు ప్రథమ ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు. కౌలు హక్కు పొందిన వారు ముందుగానే ఏటా ఏప్రిల్ ఆఖరులో మొత్తం చెల్లించి భూమిలో ప్రవేశించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

కౌన్సిలర్ కుటుంబ సభ్యులకు కాసు పరామర్శ



పిడుగురాళ్ల: పట్టణంలోని 33వ వార్డు కౌన్సిలర్ ఉప్పు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఈసందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ఉప్పు వెంకటేశ్వర్లు మరణం వైఎస్సార్ సీపీకి తీరని లోటని, ఆయన చేసిన సేవలను ఎప్పటికీ పార్టీ మర్చిపోదని పేర్కొన్నారు. ఉప్పు వెంకటేశ్వర్లు కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లో చలివేంద్రం



రెంటచింతల: వేసవి కాలంలో వివిధ పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశాల మేరకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కె.సరోజినిదేవి తెలిపారు. గురువారం చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. వేసవిలో పనుల నిమిత్తం ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చే గ్రామీణ ప్రజలు, పొలం వెళ్లే కూలీలకు, రైతులకు చల్లని నీరు అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు సీహెచ్ అబ్బిరెడ్డి, మాజీ పీహెచ్‌సీ చైర్మన్ బొడపాటి రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ గాదె శ్రీనివాసరావు, మున్నా ప్రభురాజు, ఒ.ఇన్నారెడ్డి, సిద్దయ్య పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్ (రెంటచింతల): పాలువాయి జంక్షన్ వద్ద ఉన్న షిరిడీ సాయి దేవస్థానంలో బాబాకు దేవస్థానం ప్రధాన అర్చకులు గోపాల్ పాండే ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. పల్నాడు ప్రాంతంలోని అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని సాయినాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించింది. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లూథరన్ సంఘ అధ్యక్షుడిగా ఐజయ్య



మాచర్లరూరల్: ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ సంఘం పశ్చిమ గుంటూరు అధ్యక్షుడిగా స్థానిక లూథరన్ చర్చి ఫాస్టర్ రెవరండ్ చాట్ల ఐజయ్య రాజును సంఘ పెద్దలు ఎన్నుకున్నారు. గురువారం స్థానిక లూథరన్ చర్చిలో నిర్వహించిన 88వ వార్షికోత్సవ మహాసభలో ఈ ఎన్నికను నిర్వహించారు. సంఘీయులంతా సమావేశమై లూథరన్ చర్చి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఆలయాల అభివృద్ధి, పునఃప్రతిష్టపై వారు మాట్లాడారు. ఐజయ్య పశ్చిమ గుంటూరు అధ్యక్షుడిగా ఐదేళ్లపాటు పనిచేయనున్నారు. ఈ సందర్భంగా సినాడ్ అధ్యక్షుడిగా ఎన్నికైన చాట్ల ఐజయ్య మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన సంఘ పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు కొత్తపల్లి డేవిడ్‌రాజు, అల్లి జీవన్, డేవిడ్ విల్సన్, భాస్కరబాబు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మూకల దాడులు దుర్మార్గం

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గురజాల మాజీ ఎమ్మెల్యేకాసు మహేష్‌రెడ్డి



గాయపడిన అంజిరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ మూకల దాడి దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆగ్రహించారు. పట్టణంలోని పల్నాడు హాస్పిటల్‌లో టీడీపీ మూకల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని జూలకల్లు గ్రామానికి చెందిన పాశం అంజిరెడ్డిని గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లు జూలకల్లు గ్రామంలో టీడీపీ మూకలు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి చేస్తున్నాయని మండిపడ్డారు. ఇటువంటి దాడులు మానుకోకుంటే భవిష్యత్‌లో ఇంతకు పదింతలు చవి చూడాల్సి వస్తుందని కాసు హెచ్చరించారు. పిల్లిని ఒకటికి పది సార్లు కొడితే పిల్లి కాస్త పులిలాగా మారుతుందని, కానీ పులులులాంటి జూలకల్లుల్లోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కొడుతున్నారని, మీరే ఆలోచించుకోండి, భవిష్యత్‌లో ఇంతకు పదింతలు అనుభవించాల్సి వస్తుందని ధ్వజమెత్తారు. అధికారం ప్రజలు మీకు అందించింది అభివృద్ధి చేయటానికని, ఇలాంటి దాడులు చేయటానికి కాదని పేర్కొన్నారు. జూలకల్లు గ్రామంలో వైఎస్సార్‌సీపీ చేసిన అభివృద్ధి కంటే మరింత అభివృద్ధి చేయాలని, ఇలా దాడులు చేయటం సరికాదన్నారు. అది కూడా పథకం ప్రకారం ఒక్కొక్క కార్యకర్తపై దాడి చేయటం సరికాదన్నారు. పాపం పండే రోజు ముందు ఉందని, దీనికి పదింతలు అనుభవించే రోజు ముందు ఉందని అన్నారు. తప్పు చేసిన వారిని మాత్రం వదిలిపెట్టేది లేదన్నారు. చేతనైతే మంచిచేయండి, చేతకాకపోతే వదిలేయండి, దారిన పోయే వారిని కొట్టుకుంటూపోతే టీడీపీ భూస్థాపిత మయ్యే రోజు ఉందని కాసు హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తే చేతులు ముడుచుకుని కూర్చోరని స్పష్టం చేశారు. కాసు వెంట వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, ఎన్‌డీఎల్, జూలకల్లు వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చివేత

రామకృష్ణ సేవా సమితి సభ్యుల స్వచ్ఛంద శ్రమదానం



గుంతలు పూడ్చుతున్న రామకృష్ణ సేవా సమితి సభ్యులు మెట్టు గోవిందరెడ్డి తదితరులు

మాచర్లరూరల్: నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే గుంటూరు, నర్సరావుపేట రహదారి ప్రాంతమైన రైల్వేగేటు వద్ద భారీగా గుంతలు పడ్డాయి. వాహనదారుల ఇబ్బందులను గుర్తించిన రామకృష్ణ సేవా సమితి సభ్యులు గురువారం ఆ గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. మానవ సేవే మాధవ సేవ అన్న స్వామి వివేకానంద స్ఫూర్తితో ఈ రహదారి మరమ్మతులను చేపడుతున్నట్లు సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఈ రహదారిలోని గుంతల వలన వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, ఈ గుంతలలో వాహనాలు ఇరుక్కొని తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని చెప్పారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రామకృష్ణ సేవా సమితి చేపట్టిన గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని పలువురు హర్షించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కె.వెంకటేష్, ఎస్‌కె యాసిన్, బి.మల్లికార్జున, గడ్డం శశిశేఖర్, తనూజ్, రఘు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే కాసును విమర్శిస్తే ఊరుకోం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

దాచేపల్లి: గురజాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డిపై టీడీపీ నాయకులు చౌకబారు విమర్శలు చేస్తే ఊరుకునేదిలేదని వైఎస్సార్ సీపీ నేతలు హెచ్చరించారు. మండలంలోని తక్కెళ్లపాడులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేతలు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కాసుపై టీడీపీ నేతలు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సిమెంట్ ఫ్యాక్టరీలలో ఉద్యోగాల కోసం, రైతుల సమస్యల కోసం తాము ఎంతో కృషి చేశామని, ఫ్యాక్టరీల కోసం భూములు విక్రయించిన రైతులకు న్యాయం జరిగేలా శక్తివంచన లేకుండా పని చేశామని నేతలు చెప్పారు. టీడీపీ నాయకులకు కప్పం కట్టలేదని సిమెంట్ ఫ్యాక్టరీలను మూసివేయించారనే విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని, తాజాగా ఫ్యాక్టరీల వలన నష్టపోయిన రైతులు, ప్రజలకు అండగా ఉండేందుకు తాము సిద్ధంగా ఉన్నామని నేతలు తెలిపారు. టీడీపీ నాయకులు ప్రజా సమస్యలు పట్టించుకోకుండా వైఎస్సార్‌సీపీ నేతలపై విమర్శలు చేస్తూ కాలం గడుపుతున్నారని, ఇప్పటికైనా టీడీపీ నాయకులు తమపై విమర్శలు చేయటం మానుకుని ప్రజా సమస్యలు, అభివృద్ధిపై దృష్టిసారించాలని నేతలు సూచించారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ మేడతి నరసింహారావు, ఎంపీటీసీ జంగిలి నరసింహారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుడూరి గోవర్ధన్‌రావు, పాశం వీరయ్య, నేతలు పసుపులేటి నరసింహారావు, ద్రోణాదుల రమణ, రాచకొండ కోటయ్య, పిన్నెబోయిన గంగురాజు, గాలం గిరి, టమటం నరసింహారావు పాల్గొన్నారు.

రేపు ఆవు దేవర తిరునాళ్ల



ఆవు దేవర గుడి



గుడిలో ఉన్న ఆవు దేవర

కారెంపూడి: మిరియాల గ్రామంలో అరుదైన ఆవు దేవర తిరునాళ్ల శనివారం జరగనుంది. పది తరాలుగా గ్రామంలో ప్రతి రెండేళ్లకోసారి ఆవు దేవర ఉత్సవాలను యాదవ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. నాలుగు రోజులు ఆవు దేవరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించి ఐదో రోజు శనివారం భారీగా తిరునాళ్ల నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆ రోజు తెల్లవారు జామున పుట్టలోంచి పిల్లన గ్రోవిని వెలికి తీసే కార్యక్రమాన్ని నిర్వహించి తర్వాత అందరూ గుడికి చేరుకుని గుడి ముందు వేసిన ముగ్గును ఆవుతో తొక్కించి ఆ తర్వాత గ్రామంలోని ఆవులు, ఎద్దులు కోడెలను గుడి చుట్టూ తిప్పి ఆవు దేవర ఆశీస్సులను రైతులు పొందడం ఆనవాయితీగా వస్తోంది. రైతులు తమ జీవనాధారమైన ఆలమందలను అలాగే సేద్యంలో రైతుకు చేదోడుగా ఉంటున్న ఎద్దులు, కోడెలకు రంగులు పూసి వాటిని చక్కగా అలంకరించి పూజలు చేయడం ఇక్కడ తిరునాళ్లలో విశేషం. నవమి రోజు ఆదివారం బియ్యం కొలిచి ఉత్సవాలకు సంప్రదాయ బద్ధంగా శ్రీకారం చుట్టారు. గత మంగళవారం జలబిందెలతో తరలి వెళ్లి ఆవు దేవరను యాదవ యువత అభిషేకించారు. బుధవారం బొల్లి ఆవు యుద్ధం కథాగానాన్ని కాటమరాజులు ఆలపించారు. గురువారం ఆవు దేవరకు వీర బోణం సమర్పించారు. గుడి ఆవరణలో నైవేద్యం తయారు చేసి ఆవు దేవరకు అర్పించి తర్వాత ఆ నైవేద్యాన్ని మహాప్రసాదంగా స్వీకరిస్తారు. శుక్రవారం ఆవు దేవర ప్రధాన ఉత్సవాన్ని గ్రామస్తులు ఉమ్మడిగా వైభవంగా నిర్వహించనున్నారు. ఆవు దేవరకు విద్యుత్ ప్రభలు కట్టి, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు మధ్యాహ్నం భారీ అన్నదానం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎక్కడాలేని విధంగా ఆవు దేవరకు గ్రామంలో రెండు దేవాలయాలు ఉన్నాయి.

నేడు డయల్ యువర్ డీఎం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.కోటేశ్వర నాయక్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతుందని, ప్రయాణికులు, గ్రామస్తులు ఏమైనా సలహాలు, ఫిర్యాదులు ఉంటే తెలపగలరని ఆయన వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కోటేశ్వరరావు గురువారం తెలిపారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం ఆయాప్రాంతాల్లో జరిగే రథోత్సవానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని, దీనివల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వెల్లడించారు.

గ్రామీణాభివృద్ధికి కృషి

గురజాల: గ్రామాల అభివృద్దే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ అన్నారు. పల్లెగుంత గ్రామంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏలూరి శశికుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను రచ్చబండ ద్వారా తెలుసుకుని పరిష్కరించేలా చూస్తామన్నారు. అనంతరం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ కాలనీని పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు కోటపాటి నాగమణి, రాధాకృష్ణమూర్తి, ఉల్లి నారాయణ, పిండి రామాంజీ, మారం రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు పూలే జయంత్యుత్సవం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం జ్యోతిరావుపూలే జయంత్యుత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు దాదినబోయిన ఏడుకొండలు యాదవ్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గురజాల మాజీ శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డీఎస్పీ జగదీష్ బదిలీ

గురజాల: డీఎస్పీ జగదీష్‌ని బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఐజీ కార్యాలయానికి డీఎస్పీ జగదీష్‌ను అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మాచర్లరూరల్: రోడ్డు దాటుతున్న మహిళను ఆటో ఢీకొనటంతో ఆమె తీవ్రంగా గాయపడి మృతిచెందిన ఘటన పట్టణ పరిధిలోని రింగ్‌రోడ్డు సెంటర్‌లో గురువారం జరిగింది. పట్టణానికి చెందిన షేక్ ఖాదర్‌బీ (55) పొలం పనుల నిమిత్తం రోడ్డు మీదకు వచ్చి రోడ్డు దాటుతుండగా అటుగా వస్తున్న టాటామ్యాక్సీ ఆటో ఢీకొనటంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. గాయపడిన ఆమెను హుటాహుటిన స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహిస్తుండగా ఆమె మృతిచెందినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెంచిన ధరలు తగ్గించాలి

- ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించారు
- ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎంసీపీఐయు ధర్నా



ధర్నా చేస్తున్న ఎంసీపీఐయు నాయకులు

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్‌పై రూ.50లు, పెట్రోల్, డీజిల్‌పై పెంచిన రెండు రూపాయల ఛార్జీలను వెంటనే తగ్గించాలని పల్నాడు జిల్లా భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) (ఎంసీపీఐయూ) కార్యదర్శి రెడ్‌బాష డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ఉన్న గాంధీ బొమ్మ సెంటర్ నుంచి స్టేషన్‌రోడ్డులోని గాంధీ పార్కువరకు ప్రదర్శనగా వెళ్లి అక్కడ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు వచ్చి పెంచిన ధరలకు వ్యతిరేకంగా కార్యాలయం ముందు ధర్నా చేశారు. రెడ్‌బాష మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ప్రజలకు మేము అధికారంలోకి వస్తే గ్యాస్ ధరలు పెంచమని, నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని వాగ్దానం చేశారన్నారు. రాష్ట్ర మంత్రి లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని, తాము అధికారంలోకి వస్తే బిగించమని వాగ్దానం చేశారన్నారు. కానీ ఈనాడు కరెంటు చార్జీలు పెంచి స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ఇచ్చిన వాగ్దానాలను విస్మరించారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ద్రోహం చేస్తూ వక్ఫ్ సవరణ బిల్‌ను తీసుకొచ్చి ముస్లిం ప్రజానీకానికి ద్రోహం చేసిందన్నారు. దానికి రాష్ట్రంలోని చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం బిల్లు పాస్ కావడానికి మద్దతు పలికిందన్నారు. ఇది పూర్తిగా ముస్లింలకు ద్రోహం చేయడమేనని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పెంచిన చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను బిగించడం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో మధులతకు వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శి సావ మస్తాన్‌వలి, పట్టణ కార్యదర్శి షేక్ షరీఫ్, కార్మిక సంఘం ఏఐసీటీయు నాయకులు షేక్ అలీమ్‌ఖాన్, యువజన సంఘం నాయకులు షేక్ మహబూబ్‌బాషా, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ సైదాసాహెబ్,ఏఐఎఫ్‌డీడబ్ల్యు మహిళా సంఘం జిల్లా కార్యదర్శి షేక్ రేష్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు



రామాంజనేయ యుద్ధంలో సన్నివేశం



హరిశ్చంద్ర నాటకంలోని కాటి సన్నివేశం

గణపవరంలో ముగిసిన నవమి ఉత్సవాలు

నాదెండ్ల: శ్రీరామ నవమిని పురస్కరించుకుని గణపవరం శ్రీ కోదండ రామాలయంలో జరుగుతున్న నవమి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. బుధవారం ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం చింతామణి నాటక ప్రదర్శన, రామాంజనేయ యుద్ధం, శ్రీహరిశ్చంద్ర నాటకం భక్తులను ఆకట్టుకున్నాయి. చింతామణి నాటకంలో భవానీశంకరుడిగా ఎం మరియదాసు, చింతామణిగా ప్రభావతిల నడుమ ప్రేమ సన్నివేశం ఆకట్టుకుంది. రామాంజనేయ యుద్ధంతో శ్రీరాముడిగా ఎన్ నాగరాజు, అంజనేయుడిగా కె కాశేశ్వరరావు చౌదరిల మధ్య యుద్ధసన్నివేశం ప్రేమక్షుల చప్పట్ల నడుమ హోరెత్తింది. హరిశ్చంద్ర నాటకంలో వారణాసి, కాటి సన్నివేశాల్లో హరిశ్చంద్రుడిగా దుర్గారావు, చంద్రమతిగా ప్రభావతి, నక్షత్రుకుడిగా జి వెంకటేశ్వర్లు, వీరబాహు కాళకేశకుడుగా పి సుబ్బారావు చౌదరి నటనతో ఆకట్టుకున్నారు. గణపవరం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కోలా కోటేశ్వరరావు, రమణమ్మ దంపతుల ఆర్థికచేయూతతో నాటకాలు జరిగాయి.

సాగర్ జలాలు నిలుపుదల

శావల్యాపురం: నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలో సాగర్ జలాలు పూర్తి స్థాయిలో నిలుపుదల చేసినట్లు ఎన్నెస్పీ డీఈ జరుగుల విజయలక్ష్మి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గ పరిధిలో కాల్వలు పూడికతీత ముళ్ళ కంచెలు, పిచ్చిచెట్లు తొలిగింపు పనులు చేసేందుకు గాను రూ. 2 కోట్లు 70 లక్షలు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. గతంలో చేయాల్సిన పనులకు సంబంధించి తీర్మానం చేసిన వాటికి ఈనిధులు వెచ్చించుతారన్నారు. చివరిభూముల వరకు సాగు నీరు అందేలా ఈపనులు దోహదపడతాయన్నారు. ఇందులో భాగంగా సంతగుడిపాడు సబ్ డివిజన్ పరిధిలో అద్దంకి బ్రాంచ్ కెనాల్ కట్టలపై ఉన్న నటువంటి పిచ్చిచెట్లు తొలగింపు పనులకు రూ. 66 లక్షలు నిధులు కేటాయించినట్లు తెలిపారు. అలాగే ప్రకాశం జిల్లా అద్దంకి కెనాల్‌కు రూ.27 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. నీటి సంఘలూ సభ్యులకు తీర్మానంపై ఈ పనులు జరుగుతాయన్నారు.

దాహార్తి తీర్చడం అభినందనీయం



రెంటచింతల: రెంటచింతలలో ప్రయాణికులకు, పాదచారులకు దాహార్తిని తీర్చేందుకు లేళ్ల పేరయ్య జ్ఞాపకార్థం మండల ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంఈఓ-2 వై.శివ నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక బస్‌స్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన స్థానిక స్టేట్‌బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులునాయక్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. భగభగ మండే ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని గ్రామస్తులకు చల్లటి మంచినీటిని పంపిణీ చేసేలా లేళ్ల పేరయ్య కుమారుడు శ్రీనివాసరావు మాస్టర్ చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.నాగేశ్వరరావు, బి.భీముడు నాయక్, ఎస్ఏఎఫ్ అహ్మద్, కె.అహ్మద్‌జాని, ఎస్‌కే ఆదాం మహబూబ్, ఆర్.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వడ్డీపై 50 శాతం రాయితీ

పిడుగురాళ్ల: 2024-2025 ఆర్థిక సంవత్సరంలోని ఆస్తిపన్నుల బకాయిలను ఏకమొత్తంగా చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుందని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరు వరకు వడ్డీపై 50శాతం రాయితీ ఉంటుందన్నారు. చెల్లించిన ఆస్తి పన్నుపై కూడా ఐదు శాతం రాయితీ లభిస్తుందన్నారు. సెలవు రోజుల్లో కూడా పన్ను చెల్లించవచ్చని వివరించారు.

కలెక్టర్ ఆదేశాలు లెక్కచేయరా?

- కత్తవ కాలువ, చెరువు ఆక్రమణలు తొలగించండి
- కలెక్టర్ ఆదేశాల అమలు కోసం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన ప్రజాసంఘాలు
- కార్యాలయంలో అర్జీ అందజేత



ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: పట్టణంలోని సత్తెనపల్లిరోడ్డులో ఆవుల సత్రం ప్రక్కన ఉన్న కత్తవ చెరువు డ్రెయినేజీ కాలువ, దాని మూడెకరాల చెరువు స్థలాన్ని ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించిన వారిపై చర్యలు తీసుకొని ఆక్రమణలు తొలగించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. దీనిపై కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ మున్సిపల్ కమిషనర్ పట్టించుకోకపోవడంతో గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయంలో అర్జీ అందజేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ కత్తవ చెరువు, కాలువ ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోకపోవడం వలన భూ కబ్జాదారులు ఈ స్థలం మాది అన్నట్లుగా విక్రయిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారిని వివరణ అడగ్గా ఆక్రమణలు తొలగించాలని మాకెటువంటి ప్రభుత్వ ఆదేశాలు లేవని వివరణ ఇచ్చారన్నారు. ఈ సమాధానం చెప్పిన టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని న్యాయవ్యవస్థ దృష్టికి కూడా తీసుకెళ్లబోతున్నామని అన్నారు. పట్టణ ప్రజలు రాబోయే రోజుల్లో వరద ముంపునకు గురయ్యే పరిస్థితి ఉందని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని, భూ కబ్జాదారులు నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించి కత్వా చెరువు భూమి, డ్రెయినేజీ కాలువపై నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తొలగించాలని కోరారు. పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వి.కోటనాయక్, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



వెల్లటూరులో ర్యాలీ పాల్గొన్న రైతులు, మహిళలు

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జి యల్లనూరి హనుమంత రావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేస్తూ అంతర్ పంటలు వేయడం ద్వారా రైతన్నలకు ఆదాయంతో పాటు భూమికి కావాల్సిన సూక్ష్మ పోషకాలు వృద్ధి చెంది భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 2025-26వ సంవత్సరంలో ప్రతి ఒక్క రైతు భూమి, విస్తీర్ణం, పంటలు, పాడి పశువులు వివరాలను సిబ్బందికి తెలియజేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో వ్యవసాయ అనుబంధ శాఖలతో కలిసి ప్రకృతి వ్యవసాయం ముందుకు తీసుకెళ్లేందుకు సిబ్బంది గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పంటలకు ముందుగా ఘన జీవామృతం చల్లి ప్రధానపంటతో పాటు అంతర్ పంటలు వేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు అంజలీదేవి, భూలక్ష్మి, సుబ్బరత్నం, ప్రవల్లిక, గ్రామరైతులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష వాయిదా

బొల్లాపల్లి : మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశానికి విద్యార్థులకు నిర్వహించే పరీక్ష వాయిదా వేయడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ వి.పద్మావతి గురువారం తెలిపారు. పాఠశాల విద్యాకమిషనర్ ఆదేశానుసారం పరీక్ష వాయిదా వేయినట్లు తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి మోడల్ స్కూల్లో ఆరో తరగతి జాయిన్ అయ్యే విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఈ నెల 20న నిర్వహించాల్సి ఉంది. ఆ రోజు ఈస్టర్ పర్వదినం కావడంతో మరుసటి రోజు 21 ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్స్‌ను www.cre.ap.gov.in, www.apmr.apcfrr.in వెబ్‌సైట్స్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.